క్లుప్తంగా

యోగాలో విద్యార్థుల ప్రతిభ



యోగాలో ప్రతిభ చూపిన విద్యార్థులు

గోస్పాడు: యోగా పోటీల్లో దీబగుంట్ల హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. శనివారం ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. గత నెల 29వ తేదీన నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌లో అండర్-14, 17 నియోజకవర్గ స్థాయి యోగా పోటీలు జరిగాయని తెలిపారు. అండర్-14లో సూర్యతేజ, పెద్దపవన్, మహిదర్, ప్రసన్న, సర్వనందిని, ఆర్టిస్టిక్ యోగాలో స్వాతి, దీప్తిలు ప్రతిభ చాటారు. అలాగే అండర్-17లో చాణిక్యతేజ, లక్ష్మిచరణ్, శ్రీధర్‌రెడ్డి, మేఘన, లావన్య, రితమిక్ యోగాలో శివలక్ష్మి, లక్ష్మి కౌశలస్యలు నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన యోగా టీచర్, పీడీ విశ్వనాథ్‌ను హెచ్‌ఎం అభినందించారు.

రేపు మాంసం విక్రయాలు నిషేధం

నంద్యాల(సిటీ): మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న (సోమవారం) పట్టణంలో జంతువధ, మాంస విక్రయాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అర్బన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు పట్టణంలోని అన్ని జంతు వధశాలల్లో, మటన్, చికెన్, చేపల దుకాణాలతో పాటు మాంసపు తినుబండారాలను విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధలకు విరుద్ధంగా మాంసం విక్రయించిన వారి పై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు



హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన నంద్యాల బార్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఉమ్మడి కర్నూలు జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్‌ను నంద్యాల బార్ అసోసియేషన్ నాయకులు కర్నూలులో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజయశేఖర్‌రెడ్డి, ప్రతాపరెడ్డిలు మాట్లాడుతూ నంద్యాల కోర్టు ఆవరణలో అదనపు గదుల నిర్మాణానికి నిధులు, అదనపు కోర్టు ఏర్పాటుకు హైకోర్టు జడ్జికి వినతి పత్రాన్ని ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రఘుప్రకాష్, ఎస్ ఎన్ ఖాద్రి, ప్రసాదరెడ్డి, పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

దొర్నిపాడు: మండలంలో ఆదివారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. బుర్రారెడ్డిపల్లెలో 512 పింఛన్లకు గాను రూ.13,80,500, చాకరాజువేముల లో 675కు రూ.18,31,750, దొర్నిపాడు-1లో 413కు 11,30,500, దొర్నిపాడు-2లో 400కు గాను 11,16,750, గుండుపాపల 341కి రూ.9, 32,750, కొండాపురంకు 488కి రూ.13,43,750, క్రిష్టిపాడు 299కి రూ.8,45, 000, డబ్ల్యూ గోవిందిన్నె 344కి రూ. 9,63,250, డబ్ల్యూ కొత్తపల్లె 284కు రూ.7,89,250 ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మొత్తం మండలానికి 3,756 పింఛన్లకు గాను రూ. 1,03,33,500 మంజూరు అయ్యాయని, ఆదివారం అయినప్పటికీ నగదు పంపిణీ చేస్తారన్నారు. ఇప్పటికే వలంటీర్లకు నగదును అందజేసినట్లు చెప్పారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహా కంబగిరి స్వామి, అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చన, అభిషేకాలు, ఆకుపూజ చేశారు. అర్చకులు కమలేష్‌శర్మ, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చాగలమర్రికి రూ.33 లక్షల జల్‌జీవన్ నిధులు మంజూరు

చాగలమర్రి: మండలంలోని 25 గ్రామాల్లో తాగునీటి కోసం బోర్లు, విద్యుత్తు మోటార్ల ఏర్పాటుకు రూ.33.00 లక్షల జలజీవన్ మిషన్ నిధులను మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్‌బాబు తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించడంతో నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. మండలంలోని డి.కొత్తపల్లె గ్రామంలో శనివారం ఆయన సర్పంచ్ రేనాటి బాలీశ్వరరెడ్డితో కలిసి బోరును వేయించారు. అలాగే బ్రాహ్మణపల్లె, తిప్పనపల్లె గ్రామాలలో బోర్లు వేయడం జరిగిందని ఈ బోర్లలో నీరు పుష్కలంగా పడ్డాయన్నారు. వీటికి మోటార్లు బిగించి, ట్యాంకులను నింపి, కుళాయిల ద్వారా నిటిని సరఫరా చేస్తామని చెప్పారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- ఆళ్లగడ్డ పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సక్సెస్
- మొత్తం 15,000 మందికి కూపన్లు
- వైద్య శిబిరానికి వచ్చిన 1,580 మందికి వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందుల పంపిణీ



పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష ' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతం అయింది. ఇందులో వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది 150 మందికి పైగా పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మున్సిపల్ చైర్‌మెన్ డాక్టర్ రామలింగారెడ్డి, డీఎల్‌డీఓ జనార్ధన్‌రావు, ఆర్డీఓ శ్రీనివాసులు, పోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డిలు తదితరులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్‌మెన్ గంధం రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, వైఎస్ చైర్‌మెన్‌లు నాయబ్‌రసూల్, మరియమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షేమంతో పాటు ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం పనిచేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే ప్రతి కుటుంబానికి ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా దేశంలో ఎక్కడా.. ఎప్పుడు.. ఎవరూ చేయని విధంగా 15 రోజుల నుంచి వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి 7 రకాల ప్రాథమిక పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. పట్టణ పరిధిలో 15 వేల కుటుంబాలు ఉంటే ఇంటింటికి వెళ్లి 13,700 కుటుంబాలకు 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన కలిపించి పాంప్లేట్‌లు అందజేయడం విశేషమన్నారు. శిబిరానికి వేలాది మంది రావడం జరిగిందని, అందరికి వైద్య పరీక్షలు ఒకే రోజు నిర్వహించడం సాధ్యం కాక ఇంకా ఎవరైనా మిగిలిపోతే అధైర్య పడొద్దని అవసరమైతే అధికారులతో మాట్లాడి ఇలాంటి వైద్య శిబిరాలు రెండు, మూడైనా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు



ఒంటివెలగలలో మాట్లాడుతున్న పీపీనాగిరెడ్డి

గోస్పాడు: పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని ఒంటివెలగల గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. శిబిరంలో జనరల్ ఫిజీషియన్ వైద్యులు గోపాల్, గోవర్ధన్‌రెడ్డి, చిన్న పిల్లల వ్యాధి నిపుణులు మాధవీ ప్రసన్న, స్త్రీ వ్యాధి నిపుణులు శివాణి ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో 309మందికి వైద్య పరీక్షలు చేశారు. అందులో 76 మంది కంటి పరీక్షలు, 46 మందిని పట్టణ ఆసుపత్రికి రెఫర్ చేశారు. శిబిరం వద్ద హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, గళ్ల పరీక్ష, యూరిన్, రక్త పరీక్షలను 120మందికి నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. వైద్య పరీక్షలు అనంతరం రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్ రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పార్థసారథిరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఈఓఆర్‌డీఓ అనసూయ, డాక్టర్ కాంతరావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

రుద్రవరం: మండల పరిధిలోని ముత్తలూరులో అధికారులు, వైద్య బృందం కలిసి నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తమ గడప వద్దకే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి రోగాలను దూరం చేసేందుకు తగిన మందులు ఉచితంగా అందించడం సంతోష కరమని గ్రామ ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలమూరు పీహెచ్‌సీ పరిధిలోని ముత్తలూరులో కొద్ది రోజులగా వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి దాదాపు 1093 మందికి టోకెన్లు ఇచ్చారు. వారి కోసం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఎంపీడీఓ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పాములేటి, పీహెచ్‌సీ వైద్యులు కలిసి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా జగనన్న కార్డులను పంపిణీ చేశారు. అనంతరం నాలుగు ప్రదేశాల్లో సర్వే పుస్తకాల ఆధారంగా టోకెన్లు ఇచ్చారు. ఆ టోకెన్లను తీసుకొని వ్యాధుల వారీగా వైద్యులు అమర్నాధ్‌రెడ్డి, శ్రావణి, గైనకాలజిస్టు కల్పన, ఎండీ జనరల్ వెంకటకొం డన్న, ఆప్తాల్మిక్ నరసింహ్మ వద్దకు వెళ్లగా వారు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ప్రసాదరెడ్డి, గ్రామ సర్పంచు మహేశ్వరి, ఉప సర్పంచు రామనాథ్‌రెడ్డి, గ్రామ నాయకులు పాల రామక్రిష్టారెడ్డి,మధు, శేఖర్‌రెడ్డి, బద్రినారాయణ, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సుశీలమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో అందించిన సేవలు

పట్టణంలో నివాస గృహాలు	15,000
పాంప్లేట్‌లు పంపిణీ	13,758
కూపన్‌ల పంపిణీ	5,630
మొత్తం ఓపీ	775
ప్రీరిజిస్టర్ ఓపీ	489
స్పాట్ రిజిస్టర్ ఓపీ	286
స్పెషలిస్ట్ వైద్యసేవలు	
గైనిక్	28
పీడియాట్రిక్స్	36
ఎన్‌సీడీ ఓపీ	378
కంటి వెలుగు	354
ఆరోగ్యశ్రీ రెఫరల్	254
ఈసీజీ	64
రక్తపరీక్ష	987
సిటి స్కాన్ రెఫరల్	14



ముత్తలూరులో హెల్త్ కార్డులను అందజేస్తున్న అధికారులు,వైద్యులు

చిన్న సమస్య వచ్చినా ఇబ్బంది పడేవాళ్లం



మారుమూల గ్రామమైన రాయపాడులో ఉంటున్నాం. వయస్సు పైబడటంతో పాటు ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా ఎక్కడికో పరిగెత్తుకొని వెళ్లేవాళ్లం. మా గ్రామ సమీపంలోనే డాక్టర్లు వస్తున్నారని తెలియడంతో ఇక్కడికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నా. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా లాంటి పేద వారం కోసం ఇలాంటి పనులు చేసి ఆదుకుంటున్నారు. ఆయన మేలును మరువలేం. -పుల్లమ్మ, రాయపాడు

చాలా ఆనందంగా ఉంది



సుమారు 15 సంవత్సరాల నుంచి తలలో విపరీతమైన నొప్పి వస్తుంది. ఎన్ని ఆసుపత్రులకు తిరిగినా నొప్పి తగ్గలేదు. ఇప్పుడు ఇక్కడికి వచ్చి స్పెషలిస్ట్ డాక్టర్ పరీక్షించి ఉచితంగా సీటీ స్కాన్ చేయించుకునేందుకు కర్నూలు వైద్యశాలకు రాయించి ఇచ్చారు. రిపోర్ట్ వచ్చిన తరువాత అవసరమైన ట్రీట్ మెంట్ మొత్తం ఫ్రీగా ఇస్తామన్నారు. చాలా సంతోషంగా ఉంది - ఫాతిమా

చిన్న పిల్లల ఆరోగ్య సమస్యపై పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది



చిన్న పిల్లలకు ఏదైనా జబ్బు సోకితే పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేంది. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడటంతో పాటు సరైన సమయానికి వైద్యం అందేది కాదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఆరోగ్య సమస్యను పరిష్కరించేంత వరకు మా గ్రామంలో ఇళ్ల వద్దకు వచ్చి వైద్య పరీక్షలు అందిస్తుండటంతో ఎంతో సంతోషంగా ఉంది. మా కూతురు వెరోనికకు జ్వరం సోకడంతో అందుబాటులో చిన్న పిల్లల డాక్టర్ గ్రామంలో వైద్యం చేశారు. -వసంత, ఒంటివెలగల

వైద్య శిబిరం విజయవంతం

శిరివెళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం విజయవంతమైంది. 2వ గ్రామ సచివాలయ పరిధిలోని 502 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందచేశారు. స్పెషలిస్టులు డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ భార్గవ వర్ధనరెడ్డి, మండల వైద్యాధికారులు విజయకుమార్, భవ్యలు పరీక్షలు చేశారు. 40 మందిని ఆరోగ్య శ్రీకి రెఫర్ చేశారు. శిబిరంలో అంగన్‌వాడీ టీచర్లు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆర్‌డీఓ శ్రీనివాసులు, జెడ్పీ వైఎస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సలాం, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, సర్పంచ్ సాలమ్మ, ఉప సర్పంచ్ ఇంతియాజ్ వైద్య శిబిరాన్ని సందర్శించారు.

శ్రీబాగ్ ఒడంబడిక అమలుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

నంద్యాల(సెంట్రల్): శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేయటానికి పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి కోరారు. శనివారం సమితి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు ప్రజల పట్ల వివక్షతకు వ్యతిరేకంగా జరిగిన పోరాట ఫలితంగా అక్టోబర్ 1, 1953న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని నేడు రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రావతరణ దినోత్సవాన్ని జరపనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు సంజీవనగర్‌గేట్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద అవతరణ దినోత్సవాన్ని జరపనున్నట్లు తెలిపారు.

నేడు నేషనల్ పీజీ కళాశాలలో సమితి సమావేశం

రాష్ట్రం విడిపోయిన 10 సంవత్సరాల తరువాత రాయలసీమ సాగునీటి ప్రస్తుత పరిస్థితిపై రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌జీవోస్ కాలనీలోని నేషనల్ పీజీ కళాశాలలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పట్నం రాముడు, కొమ్మా శ్రీహరి, భాస్కర్‌రెడ్డి, రాఘవేంద్ర గౌడ్, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై జిల్లా స్థాయి క్విజ్ పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కేఎస్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎయిడ్స్‌పై హైస్కూల్ విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం అసదుల్లా హుసేన్ అధ్యక్షతన జరిగిన పోటీల్లో ముఖ్యఅతిథులుగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు. ఎయిడ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పోటీలు నిర్వహించగా మొత్తం ఏడు రౌండ్లలో 115 మార్కులతో శ్రీగురురాజ హైస్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకోగా 103 మార్కులతో కేఎస్‌ఎం ఎంపీఎల్ హైస్కూల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. 93 మార్కులతో కేఎస్‌ఎం హైస్కూల్ విద్యార్థులు మూడవ బహుమతి కైవసం చేసుకున్నారు. ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు 84మార్కులతో, కస్తూరిబా బాలికలు ఉన్నత పాఠశాల వెలుగోడు విద్యార్థులు 78 మార్కులతో బహుమతులు పొందారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్లు కేవీ సుబ్బారెడ్డి, సుందర్, పాఠశాల పీడీ శివకుమార్, సుబ్బరాయుడు, సుధారాణి పాల్గొన్నారు.

'భూ హక్కు-భూరక్ష'తో రైతులకు ప్రయోజనం



రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పథకంతో రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాంబవరం గ్రామంలో శనివారం జగనన్న భూహక్కు-భూరక్ష పత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన పొలాల్లో సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో జగనన్న భూ హక్కు-భూరక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. దీంతో గ్రామాల్లో ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరించి రైతుల పొలాలను సర్వే చేయడంతో పాటు హద్దులు ఏర్పాటు అయ్యేలా రాళ్లను వేసి సమస్యలు లేకుండా చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బజయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోరెడ్డి శంకర్‌రెడ్డి, సర్వేయర్ వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఆళ్లగడ్డ : బహిర్భూమికి వెళ్లిన ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన కోటకందుకూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై నరసింహులు తెలిపిన వివరాల మేరకు రూరల్ కోటకందుకూరు గ్రామానికి చెందిన మల్లేశ్వరి (35) భర్త రామకృష్ణ ఏడేళ్ల క్రితం మృతి చెందడంతో గ్రామ శివారులోని కాశినాయన ఆశ్రమం నిర్వహిస్తున్న అత్త, మామలతో కలిసి ఉంటుంది. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక రోడ్డు వెంట బహిర్భూమికి వెళ్లింది. తిరిగి వస్తుండగా పొల్యూషన్ వాహనానికి చార్జింగ్ పెటిన విద్యుత్ వైరు రోడ్డుపై పడి ఉండటం చూసి పక్కకు తీసివేసేందుకు పట్టుకుంది. వైరు జాయింట్ ఉండటంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యులకు విగత జీవిగా పడిఉన్న మల్లేశ్వరిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తల్లి వెంకటసుబ్బమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు

రాజేశ్వరికి ఘన స్వాగతం



విద్యార్థినికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి సహకారంతో అమెరికాలో పర్యటించి రాష్ట్ర ఖ్యాతిని చాటిచెప్పిన నంద్యాల ఆణిముత్యం రాజేశ్వరికి శనివారం నంద్యాలకు చెందిన జేసీఎస్ కోఆర్డినేటర్లు దాల్‌మిల్ అమీల్, సాయిరాం రెడ్డిల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. పేద కుటుంబంలో పుట్టిన విద్యార్థిని రాజేశ్వరి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో విద్యను అభ్యసిస్తూ ఐక్యరాజ్య సమితి చేరుకుని రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చిందన్నారు. స్వాగతం పలికిన అనంతరం కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు.

క్రీడా పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీటెన్నిస్, వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కల్పిస్తాయన్నారు. క్రీడల వల్ల మంచి ప్రతిభ చాటితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. క్రీడలు ఐదు రోజుల పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో, ఇండోర్ స్టేడియంలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, వాలీబాల్ కోచ్ కిశోర్, హాకీ కోచ్ సుదర్శన్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.4.09లక్షల ఆదాయం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాలలోని ప్రథమనందీశ్వరస్వామికి చెందిన భూమి కౌలుకు శనివారం నిర్వహించిన వేలం పాటలో రూ.4.09లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ. చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానం ఆవరణలోని సర్వేనెం.453 మూడు ఎకరాల భూమిని మొట్ట మొదటి సారిగా వేలం వేయగా.. వై.శ్రీనివాసులు ఎక్కువగా పాడి సంవత్సరం పాటు లీజుకు దక్కించుకున్నాడని చెప్పారు. వేలం పాటలో ఆలయ పర్యవేక్షణ అధికారి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడుదాం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పీడీఎస్‌యూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోదక్ సమాజ్ 150వ వార్షికోత్సవ సంతాప సభను నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలో అనగారిన కులాలకు విద్యను అందించేందుకు సత్యశోదక్ సమాజ్ ద్వారా కృషి చేశారన్నారు. సమావేశంలో సతీష్, చందు, సుధాకర్, విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వం అమలు చేస్తున్న జీపీఎస్ విధానం ఉపయోగపడదని, రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ నాయకులు మాలిరెడ్డి కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదోన్నతులకు అవకాశం ఇవ్వాలన్నారు. ఒక సబ్జెక్టుకు నాట్ విల్లింగ్ ఇస్తే రెండో సబ్జెక్టుకు పదోన్నతి తీసుకోవడానికి అవకాశం కలిపించాలని కోరారు. సమావేశంలో కృష్ణారావు, భాస్కరరెడ్డి, విజయరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉద్యోగులను సస్పెండ్ చేయాలి

నంద్యాల(అర్బన్): బనగానపల్లె మండలం ఆలేబాతాండ గ్రామానికి చెందిన గిరిజనుడు ఎస్.బాలునాయక్ మృతికి కారకులైన ఎక్సైజ్ పోలీసులను విధుల నుంచి తొలగించాలని బంజార సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే బాలునాయక్ డిమాండ్ చేశారు. ఎక్సైజ్ దాడుల్లో భాగంగా పొలం పనులకు వెళుతున్న గిరిజనుడిని వాహనంతో ఢీకొట్టి మృతికి ఎక్సైజ్ పోలీసులు కారకులయ్యారన్నారు. కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.50లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నంద్యాలలో జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): ప్రపంచ ప్రముఖ ఆభరణాల సంస్థ-జోయాలుక్కాస్ జిల్లా కేంద్రమైన నంద్యాలలో ఏర్పాటు చేసిన అధునాతన ప్రపంచ స్థాయి ప్రత్యేక డిజైన్ల ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా శనివారం ప్రారంభించారు. కస్టమర్లకు అధునాతన ఆభరణాలు వైరైటీ డిజైన్లలో అందుబాటులో ఉంటాయని జోయాలుక్కస్ బ్రాంచ్ మ్యానేజర్ లిగేష్ తెలిపారు. ఆదివారంతో ఈ ఎగ్జిబిషన్ ముగియనుందని చెప్పారు. రానున్న కాలంలో సంస్థకు సంబంధించిన షోరూం నంద్యాలలో ప్రారంభిస్తామన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ధర్నాలు, ఆందోళనలతో కేసుల నుంచి తప్పించుకోలేరు
- ధైర్యవంతుడైన లోకేశ్ ముందస్తు బెయిల్‌కు ఎందుకంత ఆతృత
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



మెప్మా అర్బన్ మార్కెట్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: మహిళల సమగ్ర ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో శనివారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌మెన్ డాక్టర్ రామలింగారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడం కోసం ముఖ్యమంత్రి అనేక పథకాలను రూపొందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతుంటే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా పనిగట్టుకుని అసత్య ప్రచాలు చేస్తున్నాయన్నారు. ప్రజల సొమ్ము కోట్లు దోచుకుని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుకు పోతే కక్షసాధింపు అని ప్రజలను మభ్యపెట్టాలని చూడటం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యంలో తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. పెట్టిన సెక్షన్లు, అరెస్ట్ చేసిన తీరు సరికాదని మాత్రమే చెప్పుకుంటున్నారే తప్పా... ఏ తప్పూ చేయలేదని, నిజాయితీపరుడినని ఎందుకు చెప్పుకోలేక పోతున్నారన్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారెడ్డి, పట్టణ కన్వీనర్ నరసింహారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

జిల్లాలో ఉద్యాన పంటలకు రూ.10.36 కోట్ల బడ్జెట్



జామ తోటను పరిశీలిస్తున్న దృశ్యం

చాగలమర్రి: నంద్యాల జిల్లాలో ఉద్యానవన పంటలను సాగు చేసేందుకు మన రాష్ట్ర ప్రభుత్వం రూ.10.36 కోట్ల బడ్జెట్‌ను ఈ ఏడాది మంజూరు చేసినట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు, రాష్ట్ర ఉద్యాన పంటల సలహాదారు ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం వారు మండల కేంద్రమైన చాగలమర్రిలోని నారాయణపల్లె రస్తాలో రైతు ఉల్లి రమేష్ తన నాలుగున్నర ఎకరాల విస్తీర్ణంలో సాగుచేసిన డ్రాగన్‌ఫ్రూట్, జామా పంటను పరిశీలించారు. జిల్లా ఉద్యాన అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంఐడిహెచ్ పథకానికి రూ.8.72, రాష్ట్రీయ కిసాన్ వికాస్ పథకం కింద కూరగాయలు సాగుకు రూ.80 లక్షలు, చెరువుల కింద వరి సాగు చేయకుండా, వర్షాధార పంటలను సాగు చేసుకునేందుకు ఏపీఐజీపీ పథకం కింద రూ.72 లక్షలు మంజూరు చేసిందన్నారు. అలాగే ఉద్యానవన పంటల సేకరణ, పంట నిల్వలకు, మార్కెటింగ్‌లకు 32 కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు.

గత ప్రభుత్వంలో తాలూకాకు ఓ ఉద్యానవన శాఖ అధికారి

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉద్యానవన, వ్యవసాయశాఖలకు తాలూకా స్థాయిలో, మండల స్థాయిలో మాత్రమే అధికారులుండేవారని, దీంతో రైతులు పలు ఇబ్బందులకు గురయ్యేవారని రాష్ట్ర ఉద్యానవన శాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరి ప్రసాద్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక హార్టికల్చర్, వ్యవసాయ సహాయకులను ఏర్పాటు చేసిందని తెలిపారు. అంతేకాకుండా గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని సేవలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఓ టెక్నికల్ హరినాథ్‌రెడ్డి, ఆళ్లగడ్డ హార్టికల్చర్ అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే మండలంలో చురుగ్గా సాగుతుంది. శనివారం మండల పరిధిలోని అల్లూరు, ఎస్.కొత్తపల్లె, హరివరం, పడిగెపాడు, గ్రామాలలో ఏఎస్‌ఎమ్‌లు, ఆశా వర్కర్లు, ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుంటున్నారు. బీపీ, సుగర్ తదితర రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్‌లు తెలిపారు.

దొర్నిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో వైద్య బృందం ఇంటింటా తిరిగి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు నాగేంద్ర, రుహుల్లాఖాన్ సర్వేను పర్యవేక్షించారు.